క్లుప్తంగా

ఘనంగా పెద్దింటమ్మ అమ్మవారి పండగ


పూజలందుకుంటున్న పెద్దింటమ్మవారు

మల్కాపురం : జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మార్కెట్ వీధిలోని పెద్దింటమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. మల్కాపురం గ్రామ కంఠం పెద్దలు ప్రతి ఏటా జూలై మాసంలో పండగను నిర్వహిస్తారు.దీనిలో భాగంగా గురువారం తెల్లవారుజాము నుంచే అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనం కోసం మల్కాపురం, చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చారు. మధ్యాహ్నం అమ్మవారికి పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం ఘటాలను ఊరేగించారు. కార్యక్రమంలో మల్కాపురం గ్రామ పెద్దల భోగవల్లి నాగభూషణం, సత్యాల మహేష్, ఉరుకూటి బాబూరావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పూడికల తొలగింపు


పూడికలను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు వాయుపుత్రకాలనీ సేవా మార్గంలో గత రెండు రోజుల నుండి పెద్ద ఎత్తున వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో ఈ సేవా మార్గాన వచ్చే వాహనదారులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీనిపై కాలనీ వాసులు వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్ దృష్టికి తీసుకు వెళ్లటంతో స్పందించిన ఆమె వార్డు శానిటరీ అధికారికి పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని ఆదేశాలను జారీ చేశారు. దీంతో గురువారం పారిశుధ్య కార్మికులు పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు.

1253వ రోజుకు 'ఉక్కు' దీక్షలు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటి నుంచి ఉత్పత్తికి విఘాతాలు కల్గించారని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు పెదిరెడ్ల హరనాథ్, ఎల్.వి.రమణ ఆరోపించారు. అప్పటి నుంచి ఉత్పత్తి నిలిచిపోవడంతో భారీ యంత్రాల్లో విష వాయువులు పేరుకుపోయి పరిశ్రమలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే ఆందోళన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1253వ రోజు బుధవారం, వారు మాట్లాడారు. 7మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో నడిపేందుకు వీలుగా ఏర్పాటు చేసిన యంత్ర పరికరాలు నేడు వాడకం లేక తుప్పపట్టి మూలకు చేరే పరిస్థితి కల్పించారన్నారు.

కుష్టురహిత జిల్లాయే లక్ష్యం

మహారాణిపేట: ఇంటింటికీ తిరిగి కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం తన కార్యాలయంలో వైద్యాధికారులు, డాటా ఎంటీ ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి ఆశ కార్యకర్త, ఇతర సిబ్బంది డోర్ టు డోర్ సర్వేకు పూర్తి సహకారం అందించాలన్నారు. విశాఖ జిల్లాను కుష్టు రహిత జిల్లాగా మలచాలన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జీవన్‌రాణి, డాక్టర్ కె.సత్యవేణి, కె.వి.రమణ, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

20న ఉక్కు కేవీలో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయంలో ఈనెల 20న కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు విద్యాలయం ప్రిన్సిపాల్ వంశీకృష్ణ తెలిపారు. పీజీటీ విభాగంలో కామర్స్, ఎకనామిక్స్, టీజీటీ విభాగంలో ఇంగ్లిష్, సంస్కృతం, సైన్స్, సోషల్ సైన్స్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు అన్ని ధృవపత్రాలతో ఆ రోజు విద్యాలయానికి హాజరు కావాలన్నారు.

గెడ్డలు అస్తవ్యస్తం

- పేరుకుపోతున్న వ్యర్థాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


గోపాలపట్నం ప్రధాన రహదారిలో కల్వర్టు వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు


గోపాలపట్నం శ్మశాన వాటిక జంక్షన్‌లోని బంక్ వద్ద రహదారిపై మురుగు నీరు

గోపాలపట్నం: గెడ్డలు అస్తవ్యస్తంగా మారాయి. వర్షాలు కురుస్తుండడంతో వ్యర్థాలతో నిండిపోతున్నాయి. జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్య మరింత జఠిలంగా మారింది. పశ్చిమ నియోజకవర్గంలో చాలా గెడ్డల పరిస్థితి ఇలాగే ఉంది. మురుగునీటితో పాటు వర్షంనీరు నిల్వ ఉండి పోవడంతో దుర్వాసన, దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు వాపోతున్నారు. జీవీఎంసీ91 వ వార్డు గోపాలపట్నం ప్రధాన రహదారిలో ఉన్న గెడ్డ పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ప్రధాన రహదారి కల్వర్టు వద్ద వ్యర్థాలు పేరుకుపోయి మురుగునీరు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు ఇక్కడి పూడికలు తొలగించాలని కోరుతున్నారు.

రోడ్డుపై మురుగు

వర్షం పడితే చాలు ఇక్కడ నరమే... పాదచారులు వాహన ఛోదకులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. చిన్న వర్షం పడితే చాలు నీటితో పాటు, కాలువల్లో, బీఆర్‌టీఎస్ డెక్టుల్లో మురుగు నీరంతా రోడ్డుపైకే వచ్చేస్తోందని స్థానికులు వాపోతున్నారు. మురుగు నీరు రోడ్డుపైకి రావడంతో భరించలేని దుర్వాసన వస్తోందని, చాలా ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించాలని, మురుగు నీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోజుల తరబడి..


శ్రీరామ్‌నగర్ గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలు


గుల్లలపాలెం గెడ్డ వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

మల్కాపురం : జీవీఎంసీ 58వ వార్డు పరిధిలోని గెడ్డల్లో వ్యర్థాలు రోజుల తరబడినిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో ఎగువ ప్రాంతాల నుంచి నీరు ప్రవహించి గెడ్డలో వ్యర్థాలు కారణంగా నిలిచిపోతోంది. వార్డు పరిధి శ్రీరామ్‌నగర్, గుల్లలపాలెం, ములగాడ ప్రాంతాలలో గెడ్డలు ఉన్నాయి. అయితే ఈ గెడ్డలలో సకాలంలో వ్యర్థాలను తొలగించక పావటంతో నీరు పారడం లేదు. దీంతో మురుగునీరు పోయే దారిలేకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు స్పందించి గెడ్డల్లో వ్యర్థాలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఎడతెరిపిలేని వాన


గోపాలపట్నంలో కురుస్తున్న వర్షం

గోపాలపట్నం: గురువారం ఉదయం నుంచి చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. దీంతో ఉదయం విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం కూడా ఎడతెరిపిలేని వాన కురవడంతో రోడ్లపై నీరు చేరింది. వాహనదారులు, పాదచారులు వర్షంలోనూ తడుస్తూ తమ కార్యకలాపాలు నిర్వహించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మరో రెండు రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో గొడుగులు, రెయిన్ కోట్లుకు డిమాండ్ పెరిగింది.

వ్యక్తి అదృశ్యం


వివేక్ (ఫైల్)

గోపాలపట్నం: రెండు రోజుల్లో వస్తానని ఢిల్లీ వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సీతమ్మధార ఏపీహెచ్‌బీ కాలనీలో నివాసముంటున్న దారపునేని వివేక్ జాన్సన్ అండ్ జాన్స్ సంస్థలో పని చేస్తున్నాడు. ఈ నెల 13న ఢిల్లీ వెళుతున్న నేపథ్యంలో కరాసాలో ఉన్న తోడల్లుడు ఇంటికి వచ్చాడు. అదే రోజు వివేక్‌ను తోడల్లుడు ఎయిర్‌పోర్టులో డ్రాప్ చేశాడు. అయితే 18వ తేదీ అయినా రాకపోవడం, ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో ఆందోళన చెందిన వివేక్ భార్య అనూషా పోలీసులను ఆశ్రయించింది. అయితే విమానాశ్రయంలో టికెట్ తీసుకుని ఇమిగ్రేషన్‌లో చెక్‌అవుట్ కాకుండానే వివేక్ బయటకు వచ్చినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. దీంతో వివేక్ ఢిల్లీ వెళ్లలేదని స్పష్టమైంది. వివేక్‌ను గుర్తిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ఎయిర్‌పోర్టు పోలీసులు కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

28న గవర విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


కార్యక్రమ కరపత్రికను ఆవిష్కరిస్తున్న కేంద్ర గౌరీ సేవా సంఘం సభ్యులు

తాటిచెట్లపాలెం: ఈ నెల 28న కేంద్ర గౌరీ(గవర) సేవా సంఘం ఆధ్వర్యంలో ఇటీవల పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన గవర విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం, అభినందన సభ ఏర్పాటు చేస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు బుద్ద శివాజీ తెలిపారు. రైల్వే న్యూకాలనీలోని సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి నుంచి పీజీ వరకు జరిగిన పరీక్షల్లో 80 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు మెమెంటో, నగదుతో సత్కరించనున్నట్లు చెప్పారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులను అందజేస్తామన్నారు. గవర సామాజిక వర్గ పిల్లలకు సంఘం తరపున ఉచితంగా విద్యా భ్యాసం చేయిస్తామని పేర్కొన్నారు. అక్కయ్యపాలెం హైవే పక్కన గల విశ్వనాథ్ కన్వెన్షన్(పోర్టు కళావాణి) ఆడిటోరియంలో ఈ నెల 28న వేడుకలు జరుగుతాయన్నారు. ముఖ్య అతిథులుగా పార్వతీపురం జిల్లా కలెక్టర్ ఆడారి శ్యాంప్రసాద్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పి.జి.వి.ఆర్.నాయుడు, వైద్యుడు మళ్ల భాస్కర్ హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమ కరపత్రికను సంఘ సభ్యులు ఆవిష్కరించారు. సంఘ ప్రతినిధులు మొల్లేటి వీరకుమార స్వామి, వేగి సత్యనారాయణ, మళ్ల బలరాం, పెంటకోట సంజీవరావు నాయుడు, శరగడం సత్యనారాయణ, ఆడారి పారుపల్లి రవి, మళ్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నో ప్రవేశాల గడువు పొడిగింపు

ఎంవీపీకాలనీ: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం(ఇగ్నో) 2024 విద్యా సంవత్సరం జూలై ప్రవేశాల గడువును పొడిగించింది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కేంద్రం పరిధిలోని 11 జిల్లాల విద్యార్థులకు డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు https:// ignouadmission. samarth. edu. in/ ను సందర్శించి.. ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందుకు జూలై 31వ తేదీతో గడువు ముగుస్తుందని, పూర్తి వివరాలకు ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

పెందుర్తి: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సమగ్ర శిక్ష రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయ్ భాస్కర్ సూచించారు. తరగతి గదిలో అభ్యసన నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు 'టీచ్ టూల్' పేరిట జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన 120 మంది హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలకు తొమ్మిది రోజుల శిక్షణ తరగతులను పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటాయించిన అబ్జర్వేషన్లలను సకాలంలో పూర్తి చేసి ఉన్నతాధికారులకు సమర్పించాలని చెప్పారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధన సాగించాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉత్పత్తికి ముడి పదార్థాలు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి అవసరమైన ముడిపదార్థాలు అందజేయాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. యూనియన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ముఖ్య ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ప్లాంట్ ఉత్పత్తి పెరుగుతున్న నేపథ్యంలో మరలా ముడి పదార్థాల కొరత ఏర్పడిందన్నారు. దాని వల్ల ఉత్పత్తి తగ్గించాల్సి వస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం సెయిల్, ఎన్‌ఎండీసీ ద్వారా ప్లాంట్‌కు అవసరమైన ముడి పదార్థాలు అందజేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పి.వి.రమణమూర్తి, కొమ్ము ప్రసాద్, ప్రభాకరరెడ్డి, ఎస్.ఎ.నాయుడు, డి.మోహన్, బి.ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

మూడో అంతస్తు నుంచి పడి తాపీమేస్త్రి మృతి


ప్రమాదంలో మృతి చెందిన సురేష్(ఫైల్)

పరవాడ : పరవాడ గ్రామంలో ఓ ఇంటి నిర్మాణ పనుల్లో నిమగ్నమైన తాపీ మేస్త్రి ప్రమాదశాత్తు కాలు జారి మూడో అంతస్తు నుంచి కింద పడడంతో ప్రాణాలు కోల్పోయాడు. ఈ ప్రమాదంలో పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ గ్రామానికి చెందిన అమరపు సురేష్ (32) ప్రాణాలు కోల్పోయాడని పరవాడ సీఐ ఎస్.బాల సూర్యారావు చెప్పారు. సీఐ అందించిన వివరాల ప్రకారం పరవాడలో ప్రసాద్ సూపర్ మార్కెట్ వెనుక భాగంలో బండారు సింహాచలం నాయుడు నిర్మిస్తున్న మూడంతస్తుల భవన నిర్మాణ పనుల్లో సురేష్ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. సురేష్ యథావిధిగా గురువారం మూడో అంతస్తులో పనులు చేస్తుండగా మధ్యాహ్నం 3.40 గంటలకు ప్రమాదవశాత్తు కాలు జారి సుమారు 50 అడుగుల పై నుంచి కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ డ్యూటీ డాక్టరు పరీక్షలు జరిపి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పరవాడ సీఐ బాలసూర్యారావు చెప్పారు.

సీతమ్మధార రైతుబజార్‌లో టమాటా విక్రయాలు



సీతమ్మధార: టమాటా ధరలు విపరీతంగా పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా నుంచి కొనుగోలు చేసి శుక్రవారం నుంచి సీతమ్మధార రైతుబజారులో 8 కౌంటర్ల ద్వారా కిలో రూ.58కు విక్రయిస్తున్నట్లు ఈవో కొండబాబు తెలిపారు. సీతమ్మధార రైతుబజారులో 2,600 కిలోల టమాటా అందుబాటులో ఉందని చెప్పారు. టమాటా ధరలు తగ్గేంత వరకు రైతుబజారులో విక్రయిస్తామన్నారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఈవో కోరారు. బహిరంగ మార్కెట్‌లో కిలో టమాటా రూ.80 వరకు విక్రయిస్తున్నారు.

బాబా కీర్తనలు ఆలపించిన భక్తులు


బాబా కీర్తనలను ఆలపిస్తున్న భక్తులు

మల్కాపురం : జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం, మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని సద్గురు షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం బాబాకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా తెల్లవారుజామున బాబాకు హారతి ఇచ్చారు. అనంతరం విభూది, పంచామృతాలతో అభిషేకాలు చేపట్టారు. అనంతరం బాబాకు ఆభరణాలు,సుగంధ పుష్పాలను అలంకరించి పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం బాబాకు పల్లకీ సేవ నిర్వహించారు.అనంతరం భక్తులు కీర్తనలు ఆలపించారు.

సింహగిరిపై ఘనంగా కృష్ణమయ్య సంకీర్తనా జయంతి


కృష్ణమయ్య విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న వైదికులు, పాల్గొన్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం : ఆషాఢ ద్వాదశిని పురస్కరించుకుని సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం కృష్ణమయ్య సంకీర్తనల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో ఉన్న కృష్ణమయ్య విగ్రహం వద్ద దేవస్థానం అర్చకులు షోడషోపచార పూజలు నిర్వహించారు. విశేషంగా హారతులిచ్చారు. కృష్ణమయ్య రచించిన వచన సంకీర్తలను స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ ఆలపించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, అర్చకులు, పారాయణదారులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. తిరుమల అన్నమాచార్యుల వలే సింహాచల క్షేత్రంలో శ్రీకాంత కృష్ణమాచార్యులు ప్రసిద్ధి చెందినవారు. సింహాద్రినాథుడిపై ఆయన చాతుర్లక్ష వచన సంకీర్తనలు రచించారు. ఆసంకీర్తనలు రచించిన రోజు ఆషాఢ ద్వాదశి కావడంతో ఏటా ఆరోజు కృష్ణమయ్య సంకీర్తనల జయంతిని నిర్వహిస్తుంటారు.

తప్పిపోయిన పాప నిమిషాల్లో తల్లిదండ్రుల చెంతకు..

తక్షణం స్పందించిన పోలీసులు


తండ్రి వద్ద ఉన్న పాప

జగదాంబ: మొహర్రం ఊరేగింపుల్లో తప్పిపోయిన పాపను పోలీసులు పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మొహర్రం సందర్భంగా వివిధ మసీదుల నుంచి ఊరేగింపుగా వచ్చిన ముస్లింలు పోలీసు కమిషనర్ కార్యాలయం పక్కన ఉన్న వైశాఖీ జల ఉద్యానవనంలో అనుపు కార్యక్రమం నిర్వహిస్తారు. కుటుంబ సభ్యులతో వచ్చిన వారిలో జనసందోహం మధ్య భూపేష్‌నగర్‌కు చెందిన ఎండీ అశ్వక్, ఖుష్బూలకు చెందిన పాప తప్పిపోయింది. అయితే అక్కడే విధులు నిర్వర్తిస్తున్న పోలీసు ఆఫీసర్‌కు విషయం తెలియపరచగా వెంటనే స్పందించి 25 నిమిషాల్లో పాపను పట్టుకుని తల్లిదండ్రులు అప్పగించారు. దీంతో పాప తల్లిదండ్రులు పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

యూపీహెచ్‌సీల తనిఖీ


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు గురువారం నగరంలోని పలు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. చిన్నవాల్తేరు, దుర్గాబజార్, తోటగరువు, కొబ్బరితోట తదితర ప్రాంతాల్లో ఉన్న యూపీహెచ్‌సీలను ఆయన సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అదే విధంగా ఏఎన్‌ఎమ్‌యాపై ఆశ కార్యకర్తలు, సూపర్‌వైజర్లతో మాట్లాడారు. లబ్ధిదారులను గుర్తించి వారికి మాత్రలు అందజేయాలని తెలిపారు. అన్ని యూపీహెచ్‌సీల్లోను సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని తెలిపారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, స్టాప్ డయేరియా ప్రోగ్రాంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ వర్షాకాలంలో కీటక జనిత వ్యాధులు రాకుండా చూసుకోవాలని తెలిపారు. ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, డీఐవో, డాక్టర్ రమారెడ్డి, డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) ఎం.నాగేశ్వరరావు, పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయోగాత్మక హాల్ట్‌ల పొడిగింపు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు ఆయా స్టేషన్లలో కల్పించిన ప్రయోగాత్మక హాల్ట్‌లను మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. భువనేశ్వర్-సికింద్రాబాద్(17015) విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు సత్తెనపల్లె, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లలో హాల్ట్‌లను మరికొంత కాలం పొడిగించారు. విశాఖపట్నం-మహబూబ్‌నగర్(12861) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు మధిర స్టేషన్‌లో హాల్ట్‌ను కొనసాగించారు. పూరీ-తిరుపతి(17479) ఎక్స్‌ప్రెస్‌కు, బిలాస్‌పూర్-తిరుపతి(17481) ఎక్స్‌ప్రెస్‌కు చిన్న గంజాం స్టేషన్‌లో హాల్ట్ కొనసాగుతుంది. గుంటూరు-రాయగడ(17243) ఎక్స్‌ప్రెస్‌కు భీమడోలు స్టేషన్‌లో హాల్ట్ కొనసాగుతుంది.

విశాఖపట్నం-పలాస గమ్యం కుదింపు

విశాఖపట్నం -పలాస (07470) మెము రైలు ఈ నెల 22, 25, 27వ తేదీల్లో శ్రీకాకుళం రోడ్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో పై తేదీల్లో పలాస-విశాఖపట్నం(07471) మెము రైలు శ్రీకాకుళం రోడ్ నుంచి బయల్దేరుతుంది.

కొచ్చువేలి-బరౌని మధ్య ప్రత్యేక రైలు

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కొచ్చువేలి-బరౌని మధ్య స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. కొచ్చువేలి -బరౌని (06091) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ కొచ్చువేలిలో ఈ నెల 20న ఉదయం 8 గంటలకు బయల్దేరి 21న ఉదయం 11.45 గంటలకు దువ్వాడకు.. 22న మధ్యాహ్నం 2.30 గంటలకు బరౌని చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బరౌని-కొచ్చువేలి (06090) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ బరౌనిలో ఈ నెల 23వ తేదీ 11.30 గంటలకు బయల్దేరి మూడో రోజు తెల్లవారు 5.25 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 5.30 గంటలకు బయల్దేరి శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటకు కొచ్చువేలి చేరుకుంటుంది.

ఎర్రమట్టి దిబ్బల సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే..

సీతంపేట: అధికారుల సహకారంతోనే సహజ వనరుల దోపిడీ జరుగుతోందని, ఉదాసీనత వహిస్తే వారిపై కేసులు వేస్తామని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. జాతీయ గనుల మంత్రిత్వ శాఖ దేశంలో ప్రముఖ జ్యూలాజికల్ హెరిటేజ్ సైట్స్ లిస్టు చేస్తూ 32 స్థలాలను గుర్తించడం జరిగిందన్నారు. వాటిని రాష్ట్ర ప్రభుత్వాలు సంరక్షించి నిర్వహణ చేయాలని 2016లో గనుల శాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. అందులో ముఖ్యమైన ఎర్రమట్టి దిబ్బలను రక్షించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణ విషయంలో పార్టీలకతీతంగా సంఘటితంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.